సాక్షి యాదాద్రి భువనగిరి

సోమవారం । 4 । నవంబర్ । 2024



కారును ఢీకొట్టిన ఆటో..
కట్టంగూర్ మండలం అయిటిపాముల వద్ద కారును ఆటో ఢీకొట్టిన ఘటనలో ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. - 8లో



శరవేగంగా భవన నిర్మాణం
మోత్కూరు మున్సిపల్ భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రూ.4కోట్ల వ్యయంతో పనులు చేపట్టారు. - 9లో



ఆధ్యాత్మిక సొబగులు
యాదాద్రి మొదటి ఘాట్ రోడ్డులో స్వామి వారి నామంతో కూడిన శ్లోకాలు రాయిం చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. -10లో

న్యూస్‌రీల్

ధర్నాకు తరలిరావాలి

భువనగిరి : ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించతలపెట్టిన ధర్నాకు డ్రైవర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ కోరారు. ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం భువనగిరిలో ఆ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆటో, క్యాబ్ డ్రైవర్లకు వివిధ హామీలు ఇచ్చి ఇప్పటి వరకు నెరవేర్చడం లేదన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటోలు ఎక్కడం లేదన్నారు. దీంతో కార్మికుల కుటుంబాలు గడవడం కష్టంగా మారిందన్నారు. వెంటనే హామీలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు గనబోయిన వెంకటేష్, ప్రధానకార్యదర్శి సామల భాస్కర్, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్‌బాబు, నాయకుల భూపాల్‌రెడ్డి, సుధా మోహన్‌రెడ్డి, లక్ష్మణ్, శేఖర, శ్రీహరి, వంశీ, జావిద్, సాయి, వినయ్, స్వామి పాల్గొన్నారు.

మూసీ పునరుజ్జీవంపై మాట తప్పొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న జహంగీర్

బీబీనగర్: మూసీ పునరుజ్జీవం విషయంలో గత పాలకులు హామీలు ఇచ్చి తప్పించుకున్నారని, కాంగ్రెస్ సర్కారైనా మాట నిలబెట్టుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ కోరారు. బీబీనగర్ మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన పార్టీ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు.మూసీకి పూర్వ వైభవం తీసుకువస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నారే కానీ, ఇప్పటి వరకు యాదాద్రి జిల్లా ప్రస్తావన తేలేదన్నారు. మూసీ సుందరీకరణకు ఎన్ని నిధులు కేటాయించారో బహిరంగంగా ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండమడుగు నర్సింహ, ముత్యాలు, గాడి శ్రీనివాస్, దేవేందర్‌రెడ్డి, యాదమ్మ, సుబ్బారెడ్డి, జంగయ్య, ఈశ్వర్, సతీష్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సదర్ వేడుకలు



సదర్ వేడుకలకు దున్నపోతులను తీసుకెళ్తున్న నిర్వాహకులు

చౌటుప్పల్ : యాదవుల సదర్ వేడుకలు చౌటుప్పల్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రాంనగర్‌కాలనీకి చెందిన పాక సంజీవ, పాక చిరంజీవియాదవ్‌ల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. వేడుకల నిమిత్తం తీసుకువచ్చిన దున్నపోతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాంనగర్ నుంచి శాంతినగర్, విద్యానగర్‌ల మీదుగా చిన్నకొండూర్ చౌరస్తా వరకు సదర్ ర్యాలీ నిర్వహించారు. జనం పెద్ద ఎత్తున తరలివచ్చిన వేడుకలను వీక్షించారు.డప్పు చప్పుళ్లు, డీజే సౌండ్‌ల మధ్య బాణాసంచాలు కాల్చుతూ యువకులు చిందులేశారు.

• ఐడియా అదిరింది



రైతులు సేద్యం కోసం ఉపయోగించే వివిధ పనిముట్లను తమ సొంత ఆలోచనతో తయారు చేస్తుంటారు. ఇదే క్రమంలో భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని పడిగిపల్లికి చెందిన ఓ మహిళా రైతు డ్రమ్ము మూతను కట్ చేసి పెద్ద పారగా మల్చింది. దానికి పొడవైన కర్ర ఏర్పాటు చేసి ధాన్యాన్ని ఆరబెట్టే క్రమంలో వినియోగిస్తుంది. చిన్నసైజు పారల వల్ల వంగలేకపోతున్నామని, తన సొంత ఆలోచనతో తయారు చేసిన పార ఎంతో సౌలభ్యంగా ఉందని మహిళా రైతు తెలిపారు. – భువనగిరి టౌన్



ఐదున్నర ఎకరాల్లో వరి సాగు చేశాను. ధాన్యం మొత్తం 15 రోజుల క్రితం చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్‌కు తీసుకువచ్చాను. ఇప్పటి వరకు కాంటా వేస్తలేరు. ధాన్యాన్ని ఆరబెట్టిన సమయంలో పలుమార్లు అకస్మాత్తుగా వర్షం రావడంతో కొంతమేర ధాన్యం కొట్టుకుపోయింది. తడిసిన ధాన్యాన్ని మళ్లీ ఆరబోశాం. నా సీరియల్ వచ్చినప్పటికీ తేమ శాతం వస్తలేదని అధికారులు తూకం వేయలేదు. సకాలంలో వడ్లు కొనుగోలు చేయకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడింది.
– ఎదగాని శ్రీనివాస్, రైతు, చౌటుప్పల్



రేణికుంటలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి సుమారు వంద క్వింటాళ్ల ధాన్యం తీసుకువచ్చాను. ఇప్పటికి 20 రోజులు కావస్తుంది. ఇంతవరకు కొనుగోళ్లు ప్రారంభించడం లేదు. వర్షాలు కురుస్తుండడంతో ధాన్యాన్ని కాపడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నాం. రోజూ వడ్ల కుప్పల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుంది. నాతో పాటు ఇంకా చాలా మంది రైతులు ఉన్నారు. వారంతా కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్నారు.
– బుడిగె శ్రీశైలం, రేణికుంట, రాజాపేట మండలం

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యానికి నిదర్శనమిది

వడ్లు కొంటలేరు..!



భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో గత నెల 14న కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఇప్పటి వరకు కేంద్రానికి 189 మంది రైతులు ధాన్యం తీసుకువచ్చారు. ఇందులో 13 మంది రైతుల నుంచి మాత్రమే ధాన్యం కొనుగోలు చేశారు. ధాన్యం సేకరణకు ప్రభుత్వం మిల్లులను అలాట్ చేయడంలో జాప్యం జరిగింది. రెండు రోజుల క్రితమే మిల్లును అలాట్ చేశారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ రెండు రోజుల క్రితం రైతులు ధర్నా, రాస్తారోకో చేశారు.

కొనుగోలు కేంద్రాల్లో కదలని ధాన్యం

- 20 రోజులుగా సేకరించింది కేవలం 4,222 మెట్రిక్ టన్నులే..
- మిల్లర్ల పేచీతో అడ్డంకులు
- వర్షాలతో తడుస్తున్న ధాన్యం
- ఆరబెట్టలేక రైతుల అవస్థలు

సాక్షి యాదాద్రి : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు కదలడం లేదు. రైతులు ధాన్యం తీసుకువచ్చి నెల రోజులు కావస్తున్నా కాంటా వేయకుండా అధికారులు చోద్యం చూస్తున్నారు. ఫలితంగా వడ్ల రాశుల వద్ద కాపలా ఉండలేక, వర్షాలకు కాపాడుకోలేక అన్నదాత అరిగోస పడుతున్నాడు. కొనుగోలు కేంద్రాలను నింపాదిగా ప్రారంభించడం, తూకంలో జాప్యం, ధాన్యం దిగుమతి చేసుకోవడంతో మిల్లర్లు పేచీ, యంత్రాంగం చురుగ్గా వ్యవహరించకపోవడం.. ఇలా అనేక కారణాల వల్ల ఆశించిన స్థాయిలో కొనుగోళ్లు సాగడం లేదని తెలుస్తోంది. ఇప్పటి వరకు కేవలం 4,222 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేయడం పరిస్థితికి అద్దం పడుతోంది.

లక్ష్యం, సేకరించింది ధాన్యం ఇలా..

ఈ వానాకాలం జిల్లాలో 2,81,855 ఎకరాల్లో వరి సాగైంది. 6,12,790 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. అందులో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని సివిల్ సప్లై అధికారులు లక్ష్యంగా నిర్దేశించారు. అందుకు అనుగుణంగా ఐకేపీ, పీఏసీఎస్, రైతు సేవా సంఘాల ఆధ్వర్యంలో 369 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించి 231 సెంటర్లను ప్రారంభించారు. నిర్దేశిత లక్ష్యంలో ఇప్పటి వరకు 50 శాతం ధాన్యం సేకరించాల్సి ఉండగా.. కేవలం 4,222 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు.

మొన్నటి వరకు మిల్లర్ల పేచీ

కాంటా వేసిన ధాన్యాన్ని దించుకోకుండా మిల్లర్లు మొన్నటి వరకు పేచీ పెట్టారు. ప్రభుత్వం బకాయి పడిన మిల్లింగ్ చార్జీలు చెల్లించాలని మొండికేశారు. అయితే శనివారం మిల్లర్లతో అధికారులు చర్చలు సఫలం అయ్యాయి. ధాన్యం దించుకుంటామని ఒప్పుకోవడంతో.. ఇకనైనా కొనుగోళ్లు పుంజుకుంటాయన్న ఆశాభావంతో రైతులు ఉన్నారు.

గన్నీ బ్యాగులు, ప్యాడీ క్లీనర్లకూ కొరతే

కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు,ప్యాడీ క్లీనర్లు, తేమశాతం కొలిచే యంత్రాలకు సమస్య లేదని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఇటీవల కలెక్టర్ హనుమంతరావు గుండాల పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి బ్యాంకు సీఈఓ, ఏఈఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ట్యాబ్‌లు కూడా అందుబాటులో లేవని తెలుస్తోంది.

మొత్తం కొనుగోలు కేంద్రాలు	369
ప్రారంభించినవి	231
ధాన్యం సేకరణ లక్ష్యం	04 లక్షల మెట్రిక్ టన్నులు
కొనుగోలు చేసింది	4,222 మెట్రిక్ టన్నులు
ధాన్యం విక్రయించిన రైతులు	323

తడుసుడు.. ఆరబెట్టుడు

జిల్లాలో గత మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడుస్తోంది. ఆరబోసిన ధాన్యం తేమ శాతం వచ్చి తూకానికి వెళ్దామనుకున్న తరుణంలో వర్షం కురిసి తడిసిపోవడంతో రైతులను ఆవేదనకు గురి చేస్తోంది. వర్షాలకు జిల్లాలో రామన్నపేట, ఆలేరు, భూదాన్‌పోచంపల్లి, భువనగిరి, వలిగొండ, ఆలేరు, చౌటుప్పల్ మండలాలతోపాటు చౌటుప్పల్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం తడిసిముద్దయ్యింది. కొందరి రైతుల ధాన్యం వర్షపు నీటిలో కొట్టుకుపోయింది. తడిసిన ధాన్యాన్ని మళ్లీ ఆరబెట్టడం, అందుకు ఫ్యాన్లను అద్దెకు తీసుకువస్తుండడంతో అదనపు భారం పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వర్షానికి చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్‌లో కొట్టుకుపోయిన ధాన్యం



రామన్నపేట మండలం నీర్నెముల గ్రామానికి చెందిన ఆవుల శ్రీను ఆరున్నర ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. 300 బస్తాల దిగుబడి రావడంతో స్థానిక కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చాడు. కాంటా కోసం 50 సీరియల్ ఇచ్చారు. 25 రోజులైనా ఇంకా సీరియల్ రాలేదని, మరో ఐదు నాలుగైదు రోజులే మార్కెట్‌లోనే ఉండక తప్పదని వాపోయాడు. కుటుంబం అంతా వచ్చి ఉదయం ధాన్యాన్ని ఆరబెట్టి, సాయంత్రం దగ్గరకు చేరుస్తున్నారు.

వేగం పెంచుతాం

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచుతాం. మిల్లర్లతో ఒప్పందం కుదిరింది. మిల్లులకు ధాన్యం కోటా కేటాయించాం. ధాన్యం దింపుకోని మిల్లర్లపై క్రిమినల్ కేసులు పెట్టి మిల్లును బ్లాక్‌లిస్ట్‌లో పెడతాం. సోమవారం నుంచి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తాం.
– జగదీశ్‌కుమార్, డీఎం, సివిల్ సప్లై



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ మాడ వీధుల్లో కిక్కిరిసిన భక్తులు

నేత్రపర్వంగా సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సుప్రభాతం సేవ చేపట్టారు. అనంతరం నిజాభిషేకం, తులసీదళాలతో అర్చన చేశారు. ఇక ప్రధానాలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో జోడు సేవను భక్తుల మధ్య ఊరేగించారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవార్లకు శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారాబంధనం చేశారు. అలాగే కార్తీకమాసం సందర్భంగా భక్తులు వ్రతాలు ఆచరించి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు

- 8న రేవంత్‌రెడ్డి రాక
- ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ విప్ అయిలయ్య, కలెక్టర్ హనుమంతరావు

యాదగిరిగుట్ట : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 8న యాదాద్రికి రానున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కలెక్టర్ హనుమంతరావుతో కలిసి యాదాద్రి కొండకు దిగువన ఉన్న యాగస్థలంలో హెలిపాడ్ స్థలాన్ని పరిశీలించారు. కాగా 8వ తేదీ ఉదయం సీఎం రేవంత్‌రెడ్డి శ్రీస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించనున్నట్లు తెలుస్తోంది. అలాగే ప్రధానాలయ విమాన గోపురం స్వర్ణ తాపడం పనులపై సమీక్ష నిర్వహిస్తారని సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డి రెండవ సారి యాదాద్రి ఆలయ పర్యటనకు రానున్న నేపథ్యంలో దేవస్థానం అధికారులతో పాటు పోలీసు శాఖ అప్రమత్తమైంది. హెలిపాడ్ స్థలాన్ని పరిశీలించిన వారిలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డి, యాదగిరిగుట్ట పట్టణ సీఐ రమేష్ ఉన్నారు.



ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో చర్చిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

• అరకొర బస్సులు.. అవస్థలు



దీపావళి పండుగకు సొంతూళ్లకు వచ్చిన ప్రజానీకం తిరుగుపయనం అయ్యారు. ఈ క్రమంలో ఆదివారం ఆర్టీసీ బస్టాండ్లు ప్రయాణికులతో కిక్కిరిశాయి. సరిపడా బస్సులు లేక, ఉన్నవి సకాలంలో రాకపోవడంతో గంటల తరబడి నిరీక్షణ తప్పలేదు. భువనగిరి బస్టాండ్ రాత్రి పొద్దుపోయే వరకు రద్దీగా కనిపించింది.

చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం

- కలెక్టర్ హనుమంతరావు

భూదాన్‌పోచంపల్లి, రామన్నపేట : రైతులు పండించిన చివరి గింజ వరకూ కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తామని, ఆందోళన చెందవద్దని కలెక్టర్ హనుమంతరావు భరోసా ఇచ్చారు. ఆదివారం ఆయన భూదాన్‌పోచంపల్లి, పెద్దగూడెం, రామన్నపేట మండలం తుమ్మలగూడెంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. పలువురు రైతులకు చెందిన వడ్ల రాశుల నుంచి ధాన్యాన్ని తీసుకుని మిషన్ ద్వారా తేమ శాతాన్ని స్వయంగా పరిశీలించారు. మూసీ పరీవాహకంలో దిగుబడి పెరిగిందా, తగ్గిందా అని రైతులను అడిగారు. కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి ఎన్ని రోజులవుతుందని తెలుసుకొన్నారు. మూసీ ప్రక్షాళన చేసి సేద్యానికి స్వచ్ఛమైన నీరందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారా.. అని రైతులను ప్రశ్నించారు. ధాన్యం అమ్మిన రైతులు తమకు డబ్బులు రాలేదని చెప్పడంతో జాప్యం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశామని.. 2.50 లక్షల మెట్రిక్ టన్నులే వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ధాన్యం దిగుమతి చేసుకోవడానికి మిల్లర్లు అంగీకరించారని వెల్లడించారు. గన్నీ బ్యాగులు, హమాలీల కొరత లేదని, కొనుగోళ్లు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి గోపాల్, తహసీల్దార్లు మహేందర్‌రెడ్డి, లాల్‌బహదూర్, డీసీఎస్‌ఓ వనజాత, డీఎం సివిల్‌సప్లై జగదీశ్‌కుమార్, డీసీఓ శ్రీధర్, ఏడీఏ వెంకటేశ్వర్‌రావు, ఏఓ శైలజ, డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఎంఆర్ఐ వెంకట్‌రెడ్డి, జూలూరు పీఏసీఎస్ చైర్మన్ అందెల లింగంయాదవ్, పోచంపల్లి పీఏసీఎస్ సీఈఓ సద్దుపల్లి బాల్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామన్నపేట ఆర్ఐలు శోభ, రాజేష్, ఏపీఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్ తనిఖీ

భూదాన్‌పోచంపల్లిలోని ఎస్సీ బాలికల హాస్టల్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. హాస్టల్‌లో విద్యార్థులు తక్కువగా ఉండడంతో వార్డెన్ చంద్రకళను అడిగారు. దీపావళికి వెళ్లిన విద్యార్థులు చాలామంది రాలేదని వార్డెన్ సమాధానం ఇచ్చారు. అనంతరం తరగతి గదులను సందర్శించారు. గదుల్లో నుంచి వాసన వస్తుండటంతో శుభ్రం చేయాలని ఆదేశించారు. మెనూ అమలు, భోజన నాణ్యతపై విద్యార్థుల ద్వారా తెలుసుకున్నారు.



పోచంపల్లిలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్



తుమ్మలగూడెంలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

2025 మే నాటికి థర్మల్ ప్లాంట్ పూర్తి



యాదాద్రి థర్మల్‌ప్లాంట్‌లో పూజలు చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, జైవీర్‌రెడ్డి

- డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క
- యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో యూనిట్–1 సింక్రనైజేషన్ ప్రారంభం
- పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష

మిర్యాలగూడ : నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ పనులు 2025 మే నాటికి పూర్తి చేసి మొత్తం 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని పవర్ గ్రిడ్‌కు అనుసంధానం చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు.. ఆదివారం మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి పవర్ ప్లాంట్‌ను సందర్శించారు. రామగుండం నుంచి పవర్ ప్లాంట్‌కు బొగ్గును తరలించేందుకు దామరచర్ల వద్ద ఏర్పాటు చేసిన రైలు వ్యాగన్లను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం డిప్యూటీ సీఎం పరిశ్రమలోని యూనిట్–1లో విద్యుత్ ఉత్పత్తికి సింక్రనైజేషన్ స్విచ్ ఆన్ చేసి విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఇప్పటివరకు 1, 2 యూనిట్లను గ్రిడ్‌కు అనుసంధానం చేశామని, మిగిలిన మూడు యూనిట్లు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసి మొత్తం 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో న్యూ ఎనర్జీ పాలసీని తీసుకురాలేదని, తమ ప్రభుత్వం విద్యుత్ మేధావులతో చర్చించి త్వరలో రాష్ట్రంలో నూతన విద్యుత్ పాలసీని తీసుకొస్తుందన్నారు. మంత్రి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్‌లో కరెంట్ కోతలు లేని రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందన్నారు. నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, వైటీపీఎస్ చైర్మన్ సందీప్‌కుమార్ సుల్తానియా, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్రపవార్, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద పిల్లల భవిష్యత్తే లక్ష్యం

గరిడేపల్లి: పేద పిల్లల భవిష్యత్తే లక్ష్యంగా దేశ చరిత్రలో ఎక్కడాలేని విధంగా ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలతో ఇంగ్లిష్ మీడియంలో రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గానికి ఒక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మించాలని తలపెట్టామని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు. గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలో రూ.200కోట్ల నిధులతో నూతనంగా చేపట్టనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులకు మంత్రులు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఆదివారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ హుజూర్‌నగర్‌ను దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు.



శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి

క్లుప్తంగా

తల్లిదండ్రులు మందలించడంతో యువకుడి ఆత్మహత్య


చరణ్ కళ్యాణ్ (ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్: కాలేజీకి వెళ్లమని తల్లిదండ్రులు మందలించడంతో రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలం తాళ్లగూడెం గ్రామంలో ఆదివారం జరిగింది. రైల్వే పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట మండలం తాళ్లగూడెం గ్రామానికి చెందిన సుధగాని చరణ్ కళ్యాణ్ (17) మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా బోడుప్పల్‌లోని ఎస్‌ఆర్ కాలేజీలో ఇంటర్ సెకండియర్ చదువుతూ కాలేజీ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఇటీవల దీపావళి పండుగను స్వగ్రామానికి వచ్చాడు. సోమవారం నుంచి కాలేజీకి వెళ్లాలని, కావున ఆదివారం రోజునే ఇంటి నుంచి హాస్టల్‌కు వెళ్లమని తల్లిదండ్రులు చరణ్ కళ్యాణ్‌కి చెప్పారు. తాను వెళ్లనని, ఇంకా కొన్ని రోజులు ఉంటానని చరణ్ తెలపడంతో తల్లిదండ్రులు అతడిని మందలించారు. దీంతో శనివారం రాత్రి 11గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిన చరణ్ కళ్యాణ్ తాళ్లగూడెం గ్రామ శివారులోని రైల్వే ట్రాక్ వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోదాడ పబ్లిక్ క్లబ్ కార్యవర్గం రద్దు

- డిసెంబర్ 29న నూతన కార్యవర్గం ఎన్నిక

కోదాడ: కోదాడ పబ్లిక్ క్లబ్ కార్యవర్గంలో నెల కొన్న కీచులాటలు చివరకు కార్యవర్గం రద్దుకు దారితీసింది. ఆదివారం కోదాడ పబ్లిక్ క్లబ్ ఆవరణలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. కార్యవర్గంలో వచ్చిన అభిప్రాయ బేధాలతో ఇది వరకే అధ్యక్షుడు గాయం పట్టాభిరెడ్డి మినహా ఇతర కార్యవర్గ సభ్యులు రాజీనామా చేశారు. దీనిపై చర్చించడానికి ఆదివారం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యుల మధ్య రాజీ కుదర్చడానికి చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో పాత కార్యవర్గాన్ని రద్దు చేస్తున్నట్లు ఎన్నికల అధికారి ప్రకటించినట్లు సమాచారం. నూతన కార్యవర్గాన్ని డిసెంబర్ 29వ తేదీన ఎన్నుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా మాజీ అధ్యక్షుడు పట్టాభిరెడ్డి మాట్లాడుతూ.. తాను పబ్లిక్ క్లబ్ నియమాల ప్రకారం నడుచుకోవాలని చూశానని, ఇది కొందరికి నచ్చలేదని, ఏది ఏమైనా సర్వసభ్య సమావేశ తీర్మానానికి కట్టుబడి ఉంటానని తెలిపారు.

మూసీ వంతెన పైనుంచి పడి యువకుడికి గాయాలు


గాయపడిన యశ్వంత్

కేతేపల్లి: బైక్‌పై వెళ్తున్న యువకుడు మూసీ వంతెన పైనుంచి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన కేతేపల్లి మండలం ఉప్పలపహాడ్ సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పలపహాడ్ శివారులో మూసీ నదిపై నిర్మించిన పాత వంతెన కింద బండరాళ్లపై తీవ్ర గాయాలతో పడి ఉన్న యువకుడిని గుర్తించిన వాహనదారులు కేతేపల్లి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు యువకుడిని నది నుంచి బయటకు తీసుకొచ్చారు. మూసీ వంతెనపై నిలిపి ఉన్న రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ ఆధారంగా యువకుడిది ఆంధ్రప్రదేశ్‌లోని గన్నవరానికి చెందిన వై. యశ్వంత్‌గా పోలీసులు గుర్తించి అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. క్షతగాత్రుడు హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. యశ్వంత్ ఆదివారం రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తూ కేతేపల్లి మండలం ఉప్పలపహాడ్ శివారులో మూసీ పాత వంతెనపై బైక్‌ను నిలిపి కిందకు దూకి ఆత్మహత్యాయత్నం చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. యశ్వంత్‌ను చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శివతేజ తెలిపారు.

కారును ఢీకొట్టిన ఆటో.. ఆరుగురికి తీవ్ర గాయాలు


రోడ్డు పక్కన కూర్చున్న క్షతగాత్రులు


అయిటిపాముల గ్రామ శివారులో హైవేపై స్తంభించిన ట్రాఫిక్

- పెళ్లికి వెళ్లొస్తుండగా ప్రమాదం

కట్టంగూర్: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామ సమీపంలో ఆదివారం కారును ఆటో ఢీకొట్టిన ఘటనలో ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ గ్రామానికి చెందిన 17మంది ఆదివారం నకిరేకల్‌లో పెళ్లికి హాజరై స్వగ్రామానికి వస్తున్నారు. మార్గమధ్యలో కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామ శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న కారు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఆటో డ్రైవర్ కారును వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడడంతో కట్టంగూర్‌కు చెందిన పోగుల యాదమ్మ, పోగుల వెంకటయ్య, చెవుగోని అంజమ్మ, అబ్బగోని అంజమ్మ, కొండ నర్సమ్మ, చెవుగోని సహస్రకు తీవ్ర గాయాలయ్యాయి. కొండ అంజయ్య, పోగుల మంగ, అంతటి పుష్పమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అంబులెన్స్ వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో ఆటో వెనకాల వస్తున్న మరో మూడు కార్లు ఒకదానికొకటి ఢీకొట్టడంతో హైవేపై మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలీసులు వాహనాలను హైవే పైనుంచి తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

బైక్ అదుపుతప్పి ముగ్గురికి గాయాలు


క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

త్రిపురారం: బైక్‌పై వెళ్తున్న ముగ్గురు వ్యక్తులు నిడమనూరు మండలం వెంకట్‌నగర్ వద్ద అదుపుతప్పి బంకాపురం ఫ్లెక్సీవర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం జరిగింది. బాటసారులు గమనించి 108 వాహనంలో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మిర్యాలగూడకు తరలించారు. గాయపడిన వ్యక్తులు త్రిపురారం మండలం కంపాసాగర్ గ్రామానికి చెందిన వారిగా తెలిసింది.

ధాన్యం కొనుగోలులో జాప్యం.. రైతుల ధర్నా


నిడమనూరు మండలం శాఖాపురం గ్రామంలోని రాఘవ సాయి రైస్ మిల్లు ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

త్రిపురారం: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యాన్ని అమ్ముకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. ధాన్యాన్ని రైతులు రైస్ మిల్లులకు తీసుకెళ్తే అనేక కొర్రీలు పెడుతూ రైస్ మిల్లుల యజమానులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నిడమనూరు మండలం శాఖపురం గ్రామ పంచాయతీ పరిధిలోని రాఘవ సాయి రైస్ మిల్లుకు మండలంలోని పలు గ్రామాల రైతులు ట్రాక్టర్లల్లో ధాన్యాన్ని తీసుకెళ్లగా.. ×ధాన్యాన్ని కొనేది లేదని, ఏమి చేసుకుంటారో చేసుకోమని॰ మిల్లు యాజమాన్యం రైతులతో ఆదివారం దురుసుగా ప్రవర్తించారు. దీంతో రైతులు రైస్ మిల్లు ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రైస్ మిల్లు యాజమాన్యం ధాన్యం కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. సన్న రకం పచ్చి ధాన్యం కావడంతో ట్రాక్టర్లలో నిల్వ ఉంటే ధాన్యం పనికిరాకుండా అవుతాయని రైతులు ఆవేదన వ్యక్తం ధాన్యానికి ధర తక్కువ వేయడానికే మిల్లర్లు కుమ్మక్కై ధాన్యం కొనడం లేదని, జిల్లా అధికారులు స్పందించి ధాన్యం కొనేవిధంగా చూడాలని రైతులు కోరుతున్నారు.

భూ వివాదంలో ఎస్ఐ అన్యాయం చేశాడని రైతు ఆరోపణ

- సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వీడియో

చండూరు(గట్టుప్పల్): గట్టుప్పల్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి భూ వివాదంలో తనకు అన్యాయం చేశాడని గట్టుప్పల్ మండలం వెల్మకన్నె గ్రామానికి చెందిన సత్తయ్య మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. 1975లో తన తల్లి పేరున అప్పటి ప్రభుత్వం ఎకరం భూమి లావుణి పట్టా అందజేసిందని, ఆ భూమికి సంబంధించి పట్టాదారు పాసుపుస్తకం కూడా ఉందని, ఆ భూమిలో పంట వేస్తే కొంతమంది ధ్వంసం చేస్తున్నారని ఎస్ఐని ఆశ్రయిస్తే తన పైనే కేసు నమోదు చేసి, కించపరిచే విధంగా మాట్లాడాడని సదరు రైతు వీడియోలో మాట్లాడినట్లు తెలిసింది. ఈ భూవివాదం కోర్టులో ఉందని, తనకు న్యాయం చేయాలని బాధిత రైతులు కోరుతున్నాడు. ఈ విషయమై సీఐ వెంకటయ్య మాట్లాడుతూ.. పోలీసులపై దుష్ప్రచారం సరికాదని, సివిల్ పంచాయితీలతో పోలీసులకు సంబంధం లేదన్నారు. ఎస్ఐ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను ఎవరినీ ఇబ్బందులకు గురిచేయలేదన్నారు. తనకు వచ్చిన ఫిర్యాదుపై విచారణ చేసేందుకే ఫోన్ చేశానన్నారు.

గల్లంతైన తండ్రి, కుమారుడి మృతదేహాలు లభ్యం


కనగల్: భర్త, కుమారుడి మృతదేహాల వద్ద రోదిస్తున్న భార్య ధనలక్ష్మి


దామోదర్, ఫణీంద్ర వర్మ (ఫైల్)

కనగల్: మండలంలోని శాబ్దుల్లాపురం సమీపంలో ఏఎమ్మార్పీ ప్రధాన కాలువలో శనివారం గల్లంతైన తండ్రి, కుమారుడి మృతదేహాలు ఆదివారం నల్లగొండ మండల పరిధిలో లభ్యమయ్యాయి. గుండ్లపల్లి వంతెన వద్ద తండ్రి దామోదర్ (40)మృతదేహం లభ్యం కాగా, కుమారుడు ఫణీంద్ర వర్మ(14) మృతదేహం నల్ల గొండ మండలం కోదండపురం వంతెన వద్ద లభ్యమైనట్టు కనగల్ ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపారు. మృతుడి భార్య ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను నల్ల గొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ పేర్కొన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

గ్రామంలో విషాదఛాయలు..

తండ్రి, కుమారుడు ఒకేసారి చనిపోవడంతో శాబ్దుల్లాపురం గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. మృతుల కుటుంబ సభ్యులు, గ్రామస్తుల రోదనలు మిన్నంటాయి. దామోదర్‌కు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం కాగా.. పెద్ద కుమార్తె అక్షర తండ్రి, తమ్ముడికి తలకొరివి పెట్టింది.

బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టులో గల్లంతైన వ్యక్తి మృతదేహం వెలికితీత..

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు(ఉదయ సముద్రం చెరువు)లో గల్లంతైన వ్యక్తి మృతదేహం ఆదివారం లభ్యమైంది. సీఐ నాగరాజు, ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మండలం అప్పాజిపేట గ్రామానికి చెందిన గుండాల శంకర్(48) కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి పండుగకు చిట్యాల మండలం నేరడ గ్రామంలోని తన బంధువుల ఇంటికి వెళ్లాడు. శనివారం సాయంత్రం స్వగ్రామానికి తిరిగి వెళ్తూ మార్గమధ్యలో నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు నీటిలో కాళ్లు, చేతులు కడుక్కుంటుండగా.. కాలుజారి నీటిలో పడి ప్రవాహానికి కొట్టుకొనిపోయాడు. శనివారం రాత్రి వరకు శంకర్ కోసం ప్రాజెక్టులో గాలించగా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం గజ ఈతగాళ్లచే వెతికించగా శంకర్ మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య గుండాల లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


ఆమనగంటి శేఖర్ (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరిన యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. వివరాలు.. భూదాన్‌పోచంపల్లి మండలం ధర్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆమనగంటి శేఖర్(28) బోర్‌వెల్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి భార్య పూజ, ఏడాదిన్నర వయస్సు కల్గిన ఇద్దరు కవల ఆడపిల్లలు ఉన్నారు. శేఖర్ వారం రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాడు. ప్లేట్‌లెట్లు తగ్గాయని చెప్పడంతో అవి పెరగడానికి బొప్పాయి పండ్లు, ఆకుల రసం తాగాడు. అయినప్పటికీ జ్వరం తగ్గకపోగా, తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు రెండు రోజుల క్రితం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొంతుదూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు.

రూ.91,100 ఆర్థికసాయం అందజేత..

ఆదివారం సాయంత్రం శేఖర్ అంత్యక్రియలు నిర్వహించారు. ధర్మారెడ్డిపల్లి, సల్లోనిగూడేనికి చెందిన యువకులు రూ.91,100 విరాళాలు సేకరించి మృతుడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సుర్వి కాటంరాజు, సుర్వి వెంకటేశ్, సుర్వి శివశంకర్, ఆమనగంటి బాలరాజు, కొమిరె విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కోడెదూడలను తరలిస్తున్న డీసీఎం పట్టివేత

- అనుమతులు తీసుకునే తరలిస్తున్నామని పోలీస్ స్టేషన్ వద్ద దూడల యజమానుల నిరసన


పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న కోడెదూడల యజమానులు

కోదాడరూరల్ : కోదాడ నుంచి హైదరాబాద్‌కు కోడెదూడలను తరలిస్తున్న డీసీఎం వాహనాన్ని ఆదివారం పోలీసులు పట్టుకొని కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అన్ని అనుమతులు తీసుకొనే కోడెదూడలను తరలిస్తున్నామని వాటి యజమానులు పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చి ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. వివరాలు.. ఆదివారం కోదాడలోని పశువుల వ్యాపారుల నుంచి కొందరు వ్యాపారులు 20 కోడెదూడలను కొనుగోలు చేసి డీసీఎంలో హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఇందులో 5 కోడెదూడలను ఎలాంటి అనుమతులు లేకుండా తీసుకెళ్తున్నట్లు పోలీసులు గుర్తించి డీసీఎంను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కోడెదూడలను కొనుగోలు చేసి తీసుకెళ్తున్న వారు.. విషయాన్ని వాటిని విక్రయించిన వారికి చెప్పడంతో.. వారు పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కోడెదూడలను వాటిని కబేళాలకు తరలించడం లేదని, రైతులకు విక్రయించామని స్థానిక పశువుల వ్యాపారులు గోశాలకు తరలిస్తున్న డీసీఎంను అడ్డుకున్నారు. దీంతో పట్టణ సీఐ రాము ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది డీసీఎంకు అడ్డొచ్చిన వారిని చెదరగొట్టి దూడలను హైదరాబాద్‌లోని గోశాలకు తరలించారు. డీసీఎం యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు

- యువకుడు మృతి
- ఇద్దరికి స్వల్ప గాయాలు


రామ్‌చరణ్ (ఫైల్)

చౌటుప్పల్ రూరల్: బైక్‌ను వెనుక నుంచి ప్రైవేట్ బస్సు ఢీకొట్టడంతో యువకుడు మృతిచెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ టన శనివారం అర్ధరాత్రి విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ శివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం ఎల్లగిరి గ్రామానికి చెందిన కొలుకులపల్లి రామ్‌చరణ్(16), పీపల్‌పహాడ్ గ్రామానికి చెందిన ఊదరి శివతేజ, కొయ్యలగూడెం గ్రామానికి చెందిన కరంటోతు ఈశ్వర్ కలిసి శనివారం రాత్రి తుఫ్రాన్‌పేట గ్రామంలో నిర్వహిస్తున్న సదర్ ఉత్సవానికి బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో దండమల్కాపురం గ్రామ పరిధిలోని ఆందోళ్ మైసమ్మ దేవాలయం సమీపంలో వెనుక నుంచి వస్తున్న ఓ పరిశ్రమలో లీజ్‌కు నడుస్తున్న ప్రైవేట్ బస్సు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెనుక కూర్చున్న రామ్‌చరణ్ కిందపడిపోగా.. బస్సు అతడి పైనుంచి వెళ్లింది. తీవ్రంగా గాయపడిన రామ్‌చరణ్‌ను స్థానికులు చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని కామినేని హాస్పిటల్‌కు తరలించగా.. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బైక్‌పై ఉన్న మరో ఇద్దరికి స్వల్పగాయాలుయ్యాయి. మృతుడి తండ్రి బాలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్ ముద్దం రవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

ఉరేసుకుని యువకుడి బలవన్మరణం

కోదాడరూరల్: ఉన్నత ఉద్యోగం రావడంలేదని మనస్తాపానికి గురైన యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కోదాడ పట్టణంలోని నయానగర్‌లో ఆది వారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లి జిల్లా శిరాస గ్రామానికి చెందిన వర్ధనపు జోషి(24) రెండు సంవత్సరాలుగా కోదాడ పట్టణంలో అద్దె ఇంట్లో ఉంటూ దేవుడి సేవ చేస్తున్నాడు. తనకు ఎలాంటి ఉన్నతమైన ఉద్యోగాలు రావడం లేదని మనస్తాపంతో ఆదివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. ఇంటి యజమాని గమనించి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తెలంగాణకు రేవంత్‌రెడ్డే చివరి ఓసీ ముఖ్యమంత్రి

- మిర్యాలగూడకు చివరి ఓసీ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఓసీలను రాజకీయ సమాధి చేస్తాం
- బీసీ గర్జన సభలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న


బీసీ గర్జన సభలో మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న, చిత్రంలో నేతి విద్యాసాగర్ తదితరులు

మిర్యాలగూడ టౌన్: తెలంగాణ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డే చివరి ఓసీ ముఖ్యమంత్రి అని, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. ఆదివారం రాత్రి మిర్యాలగూడ పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపు రాజీవ్‌గాంధీ స్టేడియంలో మిర్యాలగూడ బీసీ రాజకీయ చైతన్య వేదిక కో కన్వీనర్ తమ్మడబోయిన అర్జున్ అధ్యక్షతన నిర్వహించిన బీసీ గర్జన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అగ్రవర్ణాలకు దమ్ము ఉంటే తీన్మార్ మల్లన్నపై బహిరంగ చర్చకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. మిర్యాలగూడలో బీసీ గర్జనను విఫలం చేసేందుకు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అనేక కుట్రలు పన్ని డిప్యూటీ సీఎంతో పాటు ఇద్దరు మంత్రులను దామరచర్ల మండలం యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో కార్యక్రమాన్ని చేపట్టారని అన్నారు. మిర్యాలగూడకు చివరి ఓసీ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డే అని అన్నారు. తాను ఎమ్మెల్సీగా పోటీ చేస్తే ఓడించేందుకు ఓసీలు ఎన్నో కుట్రలు పన్నారని, గెలిచిన తర్వాత రెడ్ల ఓట్లతోనే గెలిచినావని అనడం అవివేకమన్నారు. తాను బీసీ బిడ్డల సహకారంతోనే ఎమ్మెల్సీగా గెలిచానని అన్నారు. తన పనితీరు నచ్చలేదని నిరూపిస్తే రైట్ టూ రీకాల్‌కు సిద్ధమని పేర్కొన్నారు. 56 శాతం ఉన్న బీసీలకు టికెట్లు ఇవ్వకుండా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కుందూరు జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కుటుంబాలే తప్ప ఇంకా ఎవరు లేరా అని ప్రశ్నించారు. బీసీలకు రాజ్యాధికారం వస్తేనే బతుకులు బాగుపడతాయని అన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వలన బీసీలకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి పోలీసుల పోస్టింగ్‌లో కూడా బీసీలను అణగదొక్కుతున్నారని ఆరోపించారు.

సీఎం పదవికి సమర్థుడైన అభ్యర్థి తీన్మార్ మల్లన్నే..

తెలంగాణలో బీసీలకు రాజ్యాధికారం వస్తే సీఎం పదవికి సమర్థుడైన అభ్యర్థి తీన్మార్ మల్లన్నే అని శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, మాజీ రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ అన్నారు. బీసీలందరూ తీన్మార్ మల్లన్నకు అండగా నిలుస్తున్నారని అన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు చెరుకు సుధాకర్ మాట్లాడుతూ.. బీసీలందరూ చైతన్యం అయ్యేందుకు ఈ బీసీ గర్జనే వేదిక కావాలన్నారు. కార్యక్రమంలో ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరజ్ యాదవ్, బీసీ సంఘాల నేతలు వరంగల్ శ్రీనివాస్, వట్టె జానయ్య, రామరాజు, బత్తిని లత, గంగుల అంజలి, నరేందర్‌గౌడ్, కోల సైదులు, తిరుమలగిరి అశోక్, మారం శ్రీనివాస్, ఈశ్వరాచారి, జయరాజు, మురళీయాదవ్, మహేష్, నాగభూషణం, సత్యం తదితరులున్నారు.

మంత్రుల పర్యటన సాగిందిలా..

గరిడేపల్లి, హుజూర్‌నగర్, మిర్యాలగూడ: నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యటన సాగిందిలా..

- మధ్యాహ్నం 1.20 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో దామరచర్లలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు.
- 1.25 గంటలకు దామరచర్ల శివారులోని రైల్వే స్టేషన్ వద్ద గూడ్స్ జెండా ఊపి రైలును ప్రారంభించారు.
- 2.40గంటలకు పరిశ్రమలోకి వచ్చి యూనిట్–1 సింక్రనైజేషన్ స్విచ్ ఆన్ చేసిన అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు.
- 3.00గంటలకు గరిడేపల్లి మండలానికి హెలికాప్టర్‌లో బయల్దేరి వెళ్లారు.
- 3.08 గంటకు గడ్డిపల్లిలో నూతనంగా నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల వద్దకు చేరుకున్నారు.
- 3.35 గంటలకు సభా స్థలి వద్దకు చేరుకున్నారు.
- 3.53 గంటలకు పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.
- 4.01 గంటలకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రసంగించారు.
- 4.13 గంటలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రసంగించారు.
- 4.20 గంటలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు.
- 4.40 గటంలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సన్మానించారు.
- 4.53 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకొని హుజూర్‌నగర్‌కు బయల్దేరారు.
- సాయంత్రం 5గంటలకు హుజూర్‌నగర్ పట్టణ శివారులోని ఫణిగిరి గుట్ట వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్ద మంత్రులు హెలికాప్టర్ దిగారు.
- 5.02 గంటలకు ఓపెన్ టాప్ జీపులో హుజూర్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించేందుకు బయల్దేరారు.
- 5.10గంటల వరకు ఓపెన్ టాప్ జీపు నుంచే ఇళ్లను పరిశీలించారు.
- 5.15 గంటలకు ఒక ఇంట్లోకి వెళ్లి పరిశీలించారు. అక్కడ మంత్రులను స్థానిక నాయకులు సన్మానించారు.
- 5.18 గంటలకు ఓపెన్ టాప్ జీపు తిరిగి హెలిప్యాడ్ వద్దకు చేరుకుంది.
- 5.20 గంటలకు హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు తిరిగి వెళ్లారు.


దామరచర్ల మండలం యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ వద్ద డిప్యూటీ సీఎం, మంత్రులకు స్వాగతం పలుకుతున్న నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, పాల్గొన్న మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు


హుజూర్‌నగర్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించి మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి, వెంకట్‌రెడ్డి


గడ్డిపల్లిలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ శంకుస్థాపనకు వచ్చి అభివాదం చేస్తున్న మల్లు భట్టివిక్రమార్క, చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి